క్లుప్తంగా

కాకతీయ ధాబాలో తనిఖీలు



ధాబాలో వంటకాలను తనిఖీ చేస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రామచంద్ర

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని కాకతీయ ఫుడ్స్ ధాబాలపై సోమవారం ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రామచంద్ర ఆధ్వర్యంలో దాడులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాబాలో చేసిన బిరియాని, మరికొన్ని వంటకాలను పరిశీలించారు. 2011 చట్ట ప్రకారం నాణ్యతా ప్రమాణాలు పరిశీలించి కొన్ని శ్యాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపుతామన్నారు. రిపోర్టులు బట్టి చర్యలు తీసుకుంటామన్నారు.

నివాళి

నల్లమాడ: రెడ్డిపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ బీసీ నాయకుడు, డీలర్ ఈరాతి నాగప్ప(60) అనారోగ్యంతో ఆదివారం మధ్యాహ్నం మృతి చెందారు. సోమవారం బంధువులు అంత్యక్రియలు నిర్వహించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి గ్రామానికి వెళ్లి నాగప్ప మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుని భార్య లక్ష్మినర్సు, కుమారుడు, కుమార్తెను పరామర్శించి ఓదార్చారు. తనవంతు ఆర్థికసాయం అందించారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కుళ్లాయినాయక్, వైస్ ఎంపీపీ కే. సూర్యనారాయణ, సర్పంచ్ ప్రసాద్, సహకార సంఘం అధ్యక్షులు ఏ. గంగిరెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు చిన్న నాగప్ప, మైనార్టీ నాయకులు షరీఫ్, బాబావలీ, చంద్రశేఖర్ తదితరులున్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడి మృతి



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి

ముదిగుబ్బ: మండల పరిధిలోని పాముదుర్తి కొట్టాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బాబురెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సోదరుడు కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి గ్రామానికి చేరుకుని మృతదేహానికి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ ఇందుకూరి నారాయణరెడ్డి, వెంకటరెడ్డి, కిరణ్‌మోహన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులున్నారు.

ఘనంగా మిథున్ రెడ్డి జన్మదిన వేడుక



ఎంపీ మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న దృశ్యం

కదిరి అర్బన్: మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్ నివాసంలో ఎంపీ మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం మొటుకుపల్లి ఆర్డీటీ కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షులు కేఎస్ బాహుద్దీన్, మాజీ సర్పంచ్ బత్తల వెంకటరమణ,డా. బత్తల వెంకటరమణ,సీనియర్ నాయకులు బత్తల ఆదినారాయణ, సంపంగి గోవర్దన్, బాబా ఉన్నారు.

గర్భిణులకు ప్రత్యేక పరీక్షలు

తలుపుల: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో సోమవారం వైద్యాధికారులు మున్వర్ బాష, సల్మా ఆధ్వర్యంలో గర్భిణులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించారు. 82 మందిని పరీక్షించారు. 12 మంది రక్తహీనత కలవారిగా గుర్తించార. ఐరన్ సుక్రోజ్ ఇంజక్షన్లు వేశారు. 14 మంది ఉచిత అల్ట్రాసౌండ్ స్కానింగ్‌కు కదిరి ఏరియా ఆసుపత్రికి పంపినట్లు వైద్యాధికారులు తెలిపారు.

సీఐ మధు బదిలీ



కదిరి: పట్టణ సీఐ టి.మధు బదిలీ అయ్యారు. ఈ మేరకు కర్నూలు రేంజ్ డీఐజీ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయాన్ని ఎస్పీ మాధవరెడ్డి తెలియజేశారు. సీఐ మధు మరో చోటికి బదిలీ ఉత్తర్వులు వచ్చే వరకు తాత్కాలికంగా కర్నూలు డీఐజీ కార్యాలయంలో వీఆర్‌లో ఉంటారు. మొలకలచెరువు సీఐగా బదిలీ ఉత్తర్వులు రావచ్చని పోలీసు వర్గాల ద్వారా తెలిసింది.

వ్యక్తి మృతి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నగరంలోని ఇందిరానగర్ సమీపంలోని గంగానగర్‌లో నిర్మాణంలో ఉన్న భవనానికి నీళ్లు పెడుతూ ప్రమాదవశాత్తూ కిందపడి లక్ష్మీనారాయణ (40) మృతి చెందాడు. త్రీటౌన్ సీఐ ధరణి కిశోర్ తెలిపిన మేరకు..స్థానిక గంగానగర్‌కు చెందిన పుల్లలరేవు దామోదర్‌రెడ్డి ఇంటినిర్మాణ పనుల కోసం వాచ్‌మెన్‌గా నగరూరు లక్ష్మీనారాయణ ఉన్నాడు. సోమవారం భవనానికి నీళ్లు పెట్టేందుకు మూడోఫ్లోర్ ఎక్కి నీళ్లు పడుతుండగా జారికిందపడ్డాడు. ఈ ప్రమాదంలో అతను ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. పోలీసులు ప్రమాదంపై ఆరాతీశారు.

గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం

- ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి
- రూ.2.27 కోట్లతో నిర్మించిన పీహెచ్‌సీ భవనం ప్రారంభం



పీహెచ్‌సీ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి

ఎన్‌పీకుంట: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో నాడు–నేడు పథకంలో భాగంగా సుమారు రూ.2.27 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని సోమవారం మండల నాయకులు, అధికారుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆస్పత్రి గదులను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామాల ప్రజలకు సైతం కార్పొరేటు స్థాయి వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కోట్లాది రూపాయలు ఖర్చు చేసి అధునాతన సదుపాయాలు కలిగిన పీహెచ్‌సీలను అందుబాటులోకి తీసుకువస్తున్నారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వైద్య, ఆరోగ్య విభాగంలో సుమారు 50 వేల మందికి ఉద్యోగాలు కల్పించి ఏ ఆసుపత్రిలోనూ డాక్టర్లు, స్టాఫ్ కొరత కానీ లేకుండా చేసిన ఘనత మన ముఖ్యమంత్రిదే అని అన్నారు. గడిచిన 70 సంవత్సరాలలో రాష్ట్రంలో కేవలం 11 మెడికల్ కళాశాలలు కడితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తరువాత 17 మెడికల్ కళాశాలలను మంజూరు చేశారని, ఇందులో ఇప్పటికే 5 మెడికల్ కళాశాలలు ప్రారంభమయ్యాయని తెలిపారు. ప్రతి సచివాలయం పరిధిలో వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేశామని, ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా ఇంటి వద్దకే వైద్య సేవలు అందుతున్నాయని తెలిపారు. ఆరోగ్య శ్రీ పథకం ద్వారా 3,000 రకాలకు పైగా జబ్బులను పేద ప్రజలు సైతం కార్పొరేటు ఆసుపత్రులలో ఉచితంగా వైద్యం చేయించుకునే అవకాశం కల్పించామని తెలిపారు. తమ ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తోందన్నారు. 14 సంవత్సరాల టీడీపీ హయాంలో ఎంత అభివృద్ధి చేశారో.. తమ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎంత అభివృద్ధి చేశామో చూడాలని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రి నిర్మించుకోవడానికి ఇంతటి విలువైన స్థలాన్ని ఇచ్చిన దాతలను స్మరించుకొని, వారికి మండల ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు. అనంతరం భవన నిర్మాణ పనులను త్వరిత గతిన పూర్తి చేసిన నిర్మాణ సహాయకులు భాస్కర్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో మండల ఎంపీపీ ఈటెరాము, ఆర్‌అండ్‌బీ డీఈఈ శైలజ, స్థానిక సర్పంచ్ ఆంజినమ్మ, ఎంపీడీఓ ఆదినారాయణ, వైద్యాధికారులు డాక్టర్ ఆసియా, డాక్టర్ ఆనంద్‌వర్ధన్, ఎంపీటీసీ సభ్యులు కొత్తరంగారెడ్డి, తిమ్మారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు సుబహాన్, పార్టీ సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, వాటర్ షెడ్ చైర్మన్లు బయారెడ్డి, ఓబుళరెడ్డి, గ్రామకన్వీనర్ వెంకటేశ్వర్లు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రాఘవయ్య, మాజీ ఎంపీపీ సోమిరెడ్డి, నాయకులు వెంకటనారాయణరెడ్డి, శ్రీరాములు, భాస్కర్, కలాం, వాసుదేవరెడ్డి, తిరుమలనాయుడు, అంజి, గోవిందునాయక్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పక్కాగృహాల నిర్మాణం వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

- ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి

నల్లమాడ: పుట్టపర్తి నియోజకవర్గ వ్యాప్తంగా ప్రభుత్వ పక్కాగృహాల నిర్మాణాన్ని వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. నల్లసింగయ్యగారిపల్లిలోని తన స్వగృహం వద్ద సోమవారం ఎమ్మెల్యే గృహ నిర్మాణ శాఖ అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు బిల్లులు, సిమెంట్ పంపిణీకి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ఇంజినీరింగ్ సహాయకులు, మండల ఇంజనీర్లు తరచూ గ్రామాల్లో పర్యటిస్తూ లబ్ధిదారుల సమస్యలు తెలుసుకొని పరిష్కరించాలని ఎమ్మెల్యే సూచించారు. ఇసుక, సిమెంట్, స్టీల్ ఇతరత్రా గృహ నిర్మాణానికి అవసరమైన సామగ్రి కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. పక్కా గృహాల నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేసి జిల్లాలోనే పుట్టపర్తి నియోజకవర్గాన్ని ప్రథమ స్థానంలో నిలపాలని ఎమ్మెల్యే హౌసింగ్ అధికారులు, సిబ్బందికి సూచించారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ డీఈఈ నాగరాజు, మండల ఏఈలు రమణారెడ్డి, యశ్వంత్, హరిప్రకాష్‌రెడ్డి, గౌస్, సుదర్శన్‌యాదవ్, ఇంజనీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

తాడిమర్రి: స్థానిక పోలీసుస్టేషన్ ఎస్‌ఐగా ఎం.నాగస్వామి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎస్‌ఐ డీ.లక్ష్మీనారాయణను పోలీసు ఉన్నతాధికారులు వీఆర్‌కు పంపారు. దీంతో రొద్దం పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న నాగస్వామి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మండలంలో పేకాట, మట్కా, క్రికెట్ బెట్టింగులు తదితర అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు. మండలంలోని ప్రతి గ్రామానికి ఒక కానిస్టేబుల్‌ను నియమించి శాంతిభద్రతలపై ప్రత్యేక నిఘా పెడతామని ఆయన పేర్కొన్నారు.

జగనన్న కాలనీలో శరవేగంగా ఇళ్ల నిర్మాణాలు



కనగానపల్లి జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న హౌసింగ్ అధికారులు, నాయకులు

కనగానపల్లి: మండల కేంద్రంలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నట్లు హౌసింగ్ ఈఈ శంకర్‌లాల్ తెలిపారు. సోమవారం మండలంలో పర్యటించిన ఆయన స్థానిక జగనన్న కాలనీలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ కాలనీలో 508 ఇళ్ల నిర్మాణాలు జరుగుతుండగా వాటిలో ప్రస్తుతం 10 ఇళ్లకు మోల్డింగ్ పనులు చేస్తున్నట్లు హౌసింగ్ అధికారులు తెలిపారు. ఆప్షన్‌- 3 కింద నిర్మిస్తున్న ఈ ఇళ్ల నిర్మాణాలను రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సహకారంతో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, హౌసింగ్ అధికారులతో కలిసి నిర్మాణాలు చేయిస్తున్నారు. కార్యక్రమంలో దృశ్య కళల అకాడమీ స్టేట్ డైరెక్టర్ ప్రభాకర్, హౌసింగ్ ఏఈ చిరంజీవి, సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

తనకల్లు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వైవీ కౌసల్య అధ్యక్షతన నేడు (మంగళవారం) మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పూల నరసింహులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి స్థానిక సంస్థల ప్రతినిధులు, అధికారులు తప్పకుండా హాజరుకావాలని పేర్కొన్నారు.

వివాహిత అదృశ్యం

బత్తలపల్లి: మండలంలోని అనంతసాగరం గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యమైనట్లు బత్తలపల్లి పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఈశ్వరయ్య కరెంట్ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నెల 6వ తేదీన ఇంటిలో నుంచి పని నిమిత్తం ఈశ్వరయ్య వెళ్లాడు. ఈ క్రమంలోనే ఆయన భార్య కృపావతి (19) ఎక్కడికో వెళ్లిపోయింది. సాయంత్రం ఇంటికి చేరుకున్న ఈశ్వరయ్య బంధువులు, ఇతరుల ఇంట్లో విచారించుకున్నారు. సమాచారం లేకపోవడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ నాగరాజు తెలిపారు.

వైభవం.. గ్రామోత్సవం

బత్తలపల్లి: మాల్యవంతంలో సోమవారం శ్రీకృష్ణుడి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాలపాటి సూర్యనారాయణ, రంగానాయుడు, పాల్గొన్నారు.

అధ్యాపకులు నిత్య విద్యార్థులు కావాలి



మాట్లాడుతున్న రెక్టార్ ప్రొఫెసర్ ఎం.విజయకుమార్

అనంతపురం: కాలానుగుణంగా వస్తున్న మార్పులకనుగుణంగా నిరంతరం కొత్త అంశాలను అభ్యసించే నిత్య విద్యార్థుల్లా అధ్యాపకులు ఉండాలని జేఎన్‌టీయూ అనంతపురం రెక్టార్ ప్రొఫెసర్ ఎం. విజయకుమార్ పేర్కొన్నారు. సోమవారం క్యాంపస్‌లోని ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం, జేఎన్‌టీయూ అనంతపురం వర్సిటీ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ శిక్షణ ప్రారంభమైంది. 'డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ పవర్ కన్వర్టర్స్ ఫర్ ఎలక్ట్రికల్ వెహికల్స్ ' అనే అంశంపై ఇస్తున్న శిక్షణపై వివరించారు. ఈ సందర్భంగా రెక్టార్ మాట్లాడుతూ భవిష్యత్తులో ఎలక్ట్రికల్ వాహనాలకు అధిక ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఎలక్ట్రికల్ వాహనాల ధర తక్కువగా ఉంటుందన్నారు. ఈ క్రమంలో బ్యాటరీ మేనేజిమెంట్‌పైన పరిశోధనలు కొనసాగాలని కోరారు. ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ బి. రవి కుమార్ మాట్లాడుతూ ఇంజినీరింగ్‌లో ఎలక్ట్రికల్ విభాగం ముఖ్య పాత్ర వహిస్తుందన్నారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఈశ్వర్ రెడ్డి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ జే శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అరుణకాంతి, పాలకమండలి సభ్యుడు డాక్టర్ ఎం. రామశేఖర్ రెడ్డి, డాక్టర్ ఎం. అంకారావు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక వ్రతాలు



సామూహిక సత్యసాయి వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

ప్రశాంతి నిలయం: పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన ఏలూరు జిల్లా సత్యసాయి భక్తులు సోమవారం సామూహిక సత్యసాయి వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రశాంతి నిలయంలోని సత్సంగ్ భవన్‌లో వ్రతాలు ఆచరించారు. పండితుల వేదమంత్రోచ్చారణ నడుమ సత్యసాయి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. గణపతి పూజ, కుంకుమార్చన, సాయి గాయత్రి నామజపం, కలశ పూజ తదితర క్రతువులను నిర్వహించారు. వేద పండితులు సత్యసాయి సచ్చరిత్ర పారాయణం గావించారు.

పారని పచ్చ పాచిక

- కనిపించని టీడీపీ బంద్ ప్రభావం
- ప్రజల నుంచి స్పందన కరువు
- ఉనికి చాటుకునేందుకు తమ్ముళ్ల ఓవరాక్షన్



కదిరిలో తెరిచిఉన్న టీడీపీ కౌన్సిలర్ దుకాణం

స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జైలుకెళ్లిన నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ సోమవారం చేపట్టిన బంద్‌కు స్పందన కరువైంది. అక్కడక్కడా కొంతమంది నాయకులు రోడ్డెక్కినా ప్రజలకు అసౌకర్యం కలగకుండా వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చంద్రబాబు తప్పు చేశాడు, జైలుకెళ్లాడు అన్న భావనతో ప్రజలు ఉన్నట్టు కనిపించింది. అన్ని రూట్లలో ఆర్టీసీ బస్సులు తిరిగాయి. దుకాణాల నిర్వహణ యథావిధిగా కొనసాగింది.

కనగానపల్లి: స్కిల్‌స్కాంలో టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టుకు నిరసనగా ఆపార్టీ బంద్‌కు పిలుపునివ్వగా, ఎక్కడా ప్రభావం కనిపించలేదు. రాప్తాడు నియోజకవర్గంలోని కనగానపల్లితో పాటు అన్ని మండలాల్లో ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలు యథావిధిగా అన్నిచోట్లా తిరిగాయి. రామగిరి, చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి మండలాల్లో కొన్నిచోట్ల టీడీపీ కార్యకర్తలు రోడ్ల పైకి వచ్చి రాస్తారోకోలు చేసేందుకు ప్రయత్నించగా, పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.

టీడీపీ నాయకుల ఓవరాక్షన్

ఎన్‌పీకుంట: టీడీపీ అధినేత చంద్రబాబు స్కిల్ స్కామ్‌లో అరెస్టు అవడంతో సోమవారం ఆ పార్టీ బంద్‌కు పిలుపునిచ్చింది. టీడీపీ చేపట్టిన బంద్‌కు ప్రజల నుంచి స్పందన లభించక పోవడంతో ఆ పార్టీ నాయకులు రెచ్చిపోయారు. ఈ క్రమంలో మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన పీహెచ్‌సీ భవనం ప్రారంభోత్సవానికి వస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి వాహనాన్ని వైఎస్సార్ కూడలి వద్ద టీడీపీ నాయకులు అడ్డుకొని ఎమ్మెల్యే గోబ్యాక్ అంటూ నినాదాలు చేస్తూ ఓవర్‌యాక్షన్ చేశారు. వారి ధర్నాకు ఎవరూ భంగం కలిగించక పోయినా రెచ్చగొట్టే విధంగా ప్రవర్తిస్తూ గొడవలకు పాల్పడ్డారు. ఎమ్మెల్యే కారును ఆపేయడంతో వైఎస్సార్ సీపీ, టీడీపీ నాయకుల మధ్య స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. ఆందోళనకారులను పోలీసులు స్టేషన్‌కు తరలించారు.

బంద్ ప్రభావం నిల్

కదిరి టౌన్: కదిరి పట్టణంలో బంద్ ఏ మాత్రం కనిపించలేదు. యథావిధిగా దుకాణాలు తెరుచుకున్నాయి. బస్సులు తిరిగాయి.

గాండ్లపెంట: రాష్ట్ర బంద్‌కు టీడీపీ పిలుపు ఇచ్చినా ప్రజల నుంచి స్పందన లేకపోయింది. సోమవారం ఆర్టీసీ బస్సులు యథావిధిగా తిరిగాయి. బ్యాంకులు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు పనిచేశాయి. టీడీపీ నాయకుడు కందికుంట వెంకటప్రసాద్‌ను గాండ్లపెంట పోలీసుస్టేషన్ తీసుకువచ్చారు. అవాంఛనీయ సంఘటనలు లేకుండా కదిరి రూరల్ సీఐ శివశంకర్‌నాయక్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

రోగులకు ఇబ్బంది కల్గించడంతోనే లాఠీ-చార్జ్

- సీఐ ఆరోహణరావు

బత్తలపల్లి: టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించడంతో వారిని అదుపు చేయడానికి లాఠీ చార్జ్ చేయాల్సి వచ్చిందని ధర్మవరం రూరల్ సీఐ ఆరోహణరావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. అన్ని పార్టీల వారు సంయమనం పాటించాలని సూచించారు. 30 పోలీస్ యాక్ట్, 144 సెక్షన్ అమల్లో ఉన్నప్పుడు రహదారులను నిర్బంధించడం, ఆర్టీటీ ఆసుపత్రికి వచ్చే రోగులను ఇబ్బందులకు గురి చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ధర్నాలో పాల్గొన్న వారిపై కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. శాంతియుతంగా నిరసన తెలిపి ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేయాలే గాని ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం, ప్రజలకు ఇబ్బందులు కలిగించడం చట్టరీత్యా నేరమన్నారు. రాబోయే రోజులలో విద్యార్థులకు పరీక్షా సమయమని, ఎన్నికల సీజన్ కానుండడంతో అందరూ సంయమనంతో వ్యవహరించాలని ఆయన సూచించారు.

మహిళా రైతుకు పాము కాటు



అస్వస్థతకు గురైన నాగేంద్రమ్మ

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని రావులచెరువు గ్రామానికి చెందిన నాగేంద్రమ్మ అనే మహిళా రైతు సోమవారం తన పొలంలో వ్యవసాయ పనులు చేస్తుండగా పాము కాటు వేసింది. దీంతో ఆమె తీవ్ర అస్వస్థతకు గురైంది. కుటుంబ సభ్యులు గమనించి నాగేంద్రమ్మను చికిత్స నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురం తీసుకెళ్లారు.

ధర్మవరం సమీపంలో...



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సుబ్బమ్మ

ధర్మవరం అర్బన్: ధర్మవరం పట్టణంలోని చిన్నూరు గ్రామం సమీపంలో సోమవారం పొలంలో కూలి పనులు చేస్తుండగా పట్టణంలోని ఎరగుంటకు చెందిన సుబ్బమ్మకు పాము కాటువేసింది. తోటి కూలీలు ఆమెను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం సుబ్బమ్మ కోలుకుంటోంది.

బత్తలపల్లి మండలంలో..



పాము కాటుకు గురైన ప్రమీల

బత్తలపల్లి: మండలంలోని ఉప్పర్లపల్లికి చెందిన మహిళా కూలి సోమవారం పాము కాటుకు గురైంది. గ్రామానికి చెందిన కాటమయ్య భార్య ప్రమీల గ్రామంలోనే ఓ రైతు పొలంలో కూలి పనికి వెళ్లింది. పని చేస్తుండగా ప్రమాదవశాత్తు పాము కాటుకు గురైంది. వెంటనే తోటి కూలీలు ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఇద్దరికి గాయాలు

కదిరి అర్బన్: మండల పరిధిలోని వరిగిరెడ్డిపల్లి వద్ద రహదారిపై ఆదివారం ఆటో, ద్విచక్ర వాహనం ఢీ కొన్న ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు... నల్లమాడ నుంచి కుళ్లాయప్ప ఆటో నడుపుకుంటూ కదిరి వస్తున్నాడు. కదిరి నుంచి ద్విచక్రవాహనంలో చంద్ర అనే వ్యక్తి నల్లమాడకు వెళ్తున్నాడు. వరిగిరెడ్డిపల్లి వద్ద ఆటో ద్విచక్రవాహనం ఢీకొని ఇరువురికీ గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం స్థానికులు కదిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

స్థలం కేటాయించాలని వినతి

తలుపుల: మండల కేంద్రంలో భవనకార్మికులకు సమావేశ భవన నిర్మాణం చేపట్టడానికి స్థలం కేటాయించాలని సోమవారం తహసీల్దార్ శ్రీధర్‌ను వైఎస్సార్‌సీపీ సేవాదళ్ జోనల్ ఇన్‌చార్జ్ డీకే బాబు, భవన నిర్మాణ సంఘం అధ్యక్షుడు మహబుబ్‌బాష కోరారు. వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీకే బాబు మాట్లాడుతూ వందలాది కుటుంబాలు భవన నిర్మాణ పనులే జీవనాధారంగా ఉన్నారన్నారు. వారి సమస్యలపై చర్చించుకోవడానికి స్థలం కేటాయిస్తే భవనం నిర్మించుకుంటారని తహసీల్దార్‌కు వివరించారు. తహసీల్దార్ సానుకూలంగా స్పందించారు. పంచాయతీ ఈఓ మాధవరెడ్డికి వినతి పత్రం అందజేశారు.

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

బత్తలపల్లి: 'స్పందన'లో అందే అర్జీలను నిర్లక్ష్యం చేయవద్దని తహసీల్దార్ యుగేశ్వరిదేవి పేర్కొన్నారు. 'స్పందన'ను సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంతో పాటు సచివాలయాల్లో నిర్వహించారు. ఇందులో 8 అర్జీలు అందాయి. అర్హులకు ఇంటి పట్టాలు పంపిణీ చేయాలని సర్పంచు చల్లా కరుణాకర్‌నాయుడు తహసీల్దార్‌ను కోరారు. వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సౌజన్యకుమారి, ఏపీఓ ఆదెప్ప తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల స్థాయి క్రీడాపోటీలు

కనగానపల్లి: మండల కేంద్రం కనగానపల్లిలోని జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం మండల స్థాయిలో ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు పీడీ రమేష్ తెలిపారు. దీనిపై సోమవారం ఆయన స్థానిక పాఠశాల హెచ్‌ఎం లక్ష్మిదేవితో కలిసి షెడ్యూల్ విడుదల చేశారు. బాలబాలికలకు రెండు విభాగాలుగా జరిగే ఈ పోటీల్లో కబడీ, ఖోఖో, వాలీబాల్, బాడ్మింటన్, టెన్నికాయిట్‌తో పాటు కొన్ని అథ్లెటిక్స్ ఉంటాయన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

బత్తలపల్లి: శ్రావణమాసంలో సోమవారం మహిళలు ఆయా దేవాలయాల్లో పూజలు నిర్వహించారు. పోట్లమర్రి ఆంజనేయస్వామికి ఆకుపూజ నిర్వహించారు. యల్లమ్మ, పెద్దమ్మ, గంటాపురంలోని మారెమ్మ, బత్తలపల్లిలోని శ్రీలలిత త్రిపుర సుందరీ సమేతా ఓంకారేశ్వరుడు,బళ్లారి దుర్గమ్మ, గంగమ్మ, మహాలక్ష్మీ దేవాలయాలు కిటకిటలాడాయి.